సాక్షి సిద్దిపేట

బుధవారం । 24 । జూలై । 2024



గుండె చప్పుడు..

ఓ డాక్టర్ తన తండ్రి స్మారకార్థం వేలాది మంది అభాగ్యులకు ఉచితంగా గుండె వైద్య సేవలు అందిస్తున్నారు.

వివరాలు IIలో ▸



గుణాత్మక విద్యకు ప్రాధాన్యం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచాలని, గుణాత్మకమైన విద్యను అందించాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు.

వివరాలు IIలో ▸



యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

అధిక వర్షాలు కురిసినపుడు పత్తిపైరులో నీరు నిలిచి, చీడపీడలు సోకే ప్రమాదం ఉంది. దీంతో యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

మాస్టర్ పూర్ణబోధకు 'బాల కళాశ్రీ' పురస్కారం



పురస్కారం ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ప్రముఖ బాల కళాకారుడు, బాలనటుడు మాస్టర్ పూర్ణబోధకు 'బాలకళాశ్రీ' పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు జబర్దస్త్ ఫేమ్ లక్ష్మీకిరణ్ మంగళవారం తెలిపారు. భారతి జాతీయ సాంస్కృతిక సంస్థ, నవకళాభారతి సంయుక్తంగా, టీ.వీ రంగయ్య సారథ్యంలో షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలల నాటకోత్సవాలలో ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు శ్రీవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ రాజు, జబర్దస్త్ ఫేమ్ సునామీ సుధాకర్‌ల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తులు..

హుస్నాబాద్‌రూరల్: గిరిజన గురుకుల కళాశాల, వరంగల్ యాకుబ్‌పూర్ గిరిజన కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలోని ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థులు ఈ నెల 26 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వచ్చి అడ్మిషన్ పొందవచ్చన్నారు.

తేనెటీగల పెంపకంలో పరస్పర ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): తేనెటీగల పెంపకంలో ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం.. తెలంగాణ బీ హబ్ సొసైటీ (టీబీహెచ్ఎస్)ల మధ్య పరస్పర సహకార ఒప్పందం కుదిరింది. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజప్రభాకర్, బీహబ్ సొసైటీ ప్రతినిధులు కె.ఇందిరారెడ్డి, ఎన్.రామచంద్ర, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీలత, శ్రీధర్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యంగా ములుగు ఉద్యాన యూనివర్సిటీ, బీ హబ్ సొసైటీల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. ఈ అవగాహన ఒప్పందంతో తేనెటీగల పెంపకం కార్యక్రమాలు మరింత విస్తృత మవుతాయని అన్నారు. తేనెటీగల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, రాజశేఖర్, విజయ, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీకి అడ్డుకట్ట వేయాలి

గజ్వేల్: కార్మికుల శ్రమ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని బీఎంఎస్ రాణే బ్రేక్ లైనింగ్స్ ఫ్యాక్టరీ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ సల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఏడు దశాబ్దాలుగా బీఎంఎస్ రాజీలేని పోరాటాలు సాగిస్తూ ఎన్నో విజయాలను సాధించిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ పని చేస్తామన్నారు.

జిల్లాకు దక్కిన గౌరవం

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



సంబరాల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్..

సిద్దిపేటరూరల్: జిల్లాలో అమలవుతున్న స్టీల్‌బ్యాంక్ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలతో పాటుగా ఐదు మున్సిపాలిటీల్లో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించడం ఎంతో గొప్పవిషయమన్నారు. జిల్లా స్టీల్ బ్యాంక్ నిర్వహణలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆర్థిక సర్వే ప్రత్యేకంగా ప్రస్తావించిందన్నారు. స్టీల్ బ్యాంక్ కార్యక్రమంలో విజయవంతంగా నిర్వహించిన పంచాయతీ, మున్సిపల్ సంబంధిత శాఖల అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీపీఓ దేవకీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





హరితం.. హననం..

ఒక పక్క వనమహోత్సవం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి మొక్కలు నాటుతుండగా, మరో పక్క చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. వర్గల్ మండలం నెంటూరు-మైలారం రోడ్డుమార్గంలో ఇరువైపులా దశాబ్దం క్రితం నాటిన మొక్కలు చక్కగా ఎదిగాయి. రోడ్డు మార్గంలో వెళ్లేవారికి నీడను, చల్లని గాలిని, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పర్యావరణానికి బాసటగా నిలుస్తున్నాయి. అయితే ఈదారిలో అనేక చెట్లను అడ్డగోలుగా నరికేశారు. హరిత లక్ష్యాన్ని నీరుగారుస్తున్న అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. - వర్గల్(గజ్వేల్)

ఆమోద ముద్రయేనా?

- కేంద్ర బడ్జెట్ తీరుపై సర్వత్రా భిన్నాభిప్రాయాలు..
- జిల్లా ప్రయోజనాలపై ఆసక్తి..
- పెదవి విరుస్తున్న ప్రతిపక్షాలు

సాక్షి, సిద్దిపేట : వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరికి ఖేదం.. మరికొందరికి మోదంలా ఉంది. పేద, మధ్య తరగతి ప్రజల్లో సొంతింటి కలపై ఆశలు నెలకొన్నాయి. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యలకు పెద్దపీట వేశారు. ముద్ర లోన్ పరిమితిని రూ.20లక్షలకు పెంచారు. 300 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే వారికి సోలార్ యూనిట్లను అందించనున్నారు. కేంద్ర బడ్జెట్ ప్రకటించిన సందర్భంగా జిల్లాలో ఎవరెవరికి ఏమేర లబ్ధి చేకూరనుందో పరిశీలిద్దాం..

సొంతిల్లు కల నెరవేరేనా?

పేద ప్రజల సొంతింటి కలపై ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా 3 కోట్ల ఇళ్లను నిర్మిస్తామని ప్రకటించారు. ఇటీవల సొంత ఇల్లు లేదని 2,36,014 మంది దరఖాస్తు చేశారు. దీంతో పట్టణాలు, అద్దె ఇళ్లల్లో నివసించే వారు తమ సొంతింటి కలను సాకారం అయ్యే దిశగా అడుగులు పడనున్నాయి.

గ్రామాల అభివృద్ధి..

కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి రూ.2,65,808 కోట్లు కేటాయించారు. దీంతో జిల్లాలోని 499 గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందనున్నాయి. అలాగే పనికి ఆహార పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు. కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేశారు.

సోలార్ యూనిట్లు..

గృహ అవసరాలకు 300 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న వారికి సోలార్ యూనిట్లను అందించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ప్రారంభం. దీంతో ఒక్కో గృహానికి ఏడాదికి సుమారు రూ.15వేలు విద్యుత్ బిల్లు కట్టే భారం తగ్గనుంది. అలాగే విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,48,568 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను 1,81,365 వినియోగదారులు వినియోగిస్తున్నారు.

వ్యవసాయానికి..

వ్యవసాయ అనుబంధానికి బడ్జెట్‌లో రూ.1,51,851 కోట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 2,92,662 మంది రైతులుండగా 6.40లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన కింద సాయంను రైతులకు అందిస్తున్నారు. త్వరలో వ్యవసాయ అనుబంధ వాటిని ప్రోత్సహించేందుకు పలు పథకాలను తీసుకరానున్నారు. దీంతో జిల్లాలలోని రైతులకు మేలు జరిగే అవకాశాలున్నాయి.



రుణ పరిమితి పెంపు

ముద్ర రుణాల పరిమితిని పెంచారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై)ను 8 ఏప్రిల్ 2015లో ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. చిరు వ్యాపారులకు ముద్ర రుణాలు ఎంతో దోహదపడుతున్నాయి. రూ.10లక్షల వరకు ముద్ర రుణాలు ఇచ్చే వారు. మంగళవారం కేంద్ర బడ్జెట్‌లో ఈ రుణాలను రూ.20లక్షలకు ఇవ్వనున్నారని ప్రకటించారు. జిల్లాలో 2023–2024లో 17,953 మంది ముద్ర లోన్ ద్వారా రూ 200.59కోట్లు తీసుకున్నారు. లోన్ పరిమితిని పెంచడంతో చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిరాశపరిచింది..



కేంద్ర బడ్జెట్ నిరాశే మిగిల్చింది. బీజేపీ అధికారంలోకి వస్తే రూ.5లక్షల వరకు పన్ను మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చినా రూ.3లక్షలకే పరిమితం చేశారు. వేతన, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి లాభం చేకూరలేదు. ఉద్యోగులకు ఇస్తున్న స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుండి రూ.75వేలకు పెంచడం ఊరట కల్గిస్తుంది.

– గుండు భూపేష్, సీఏ, సిద్దిపేట.

చిరు వ్యాపారులకు లబ్ధి



ముద్ర రుణాల పరిధిని రూ.10లక్షల నుంచి రూ.20లక్షల పెంచడంతో చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరుతుంది. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, గృహ నిర్మాణాలు, విద్య, మౌలిక సదుపాయాలు, తదితర రంగాలకు నిధులు కేటాయించడంతో, ఈ రంగాలు అభివృద్ధే చెందే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను దారులకు కొంత ఊరట.

–క్రాంతి కుమార్, సీఏ, సిద్దిపేట

తెలంగాణ ఊసే లేదు



కేంద్రం తెలంగాణకు మొండిచెయ్యి చూపింది. నిధులు రాబట్టడంలో విఫలమైన బీజేపీ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలి. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల సీఎంలకు భయపడి వారికి అధిక నిధులు కేటాయించారు. విభజన హామీల అమలు కోసం నిధులు కేటాయించాలి. రాష్ట్ర ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అర్థం చేసుకుని కేంద్రం తీరును ఖండించాలి.

– పవన్, జిల్లా కార్యదర్శి, సీపీఐ

రుణమాఫీ దేశానికే ఆదర్శం

- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దేవేందర్‌రెడ్డి, రైతులు

కొండపాక(గజ్వేల్): రైతు రుణమాఫీ దేశంలో ఆదర్శంగా నిలుస్తుందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. కొండపాకలోని పీఏసీఎస్‌లో నుంచి రుణాలు పొందిన 494 మంది రైతుల రుణాలు మాఫీ కావడంతో మంగళవారం కార్యాలయం ఎదుట రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిట్టి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందన్నారు. రుణాలు మాఫీ చేస్తామంటూ పదేళ్ళుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతుల కష్టాలు తెలిసిన నేత సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మాఫీ చేస్తామన్న మాటలకు కట్టుబడి పని చేస్తున్నారన్నారు. స్థానిక పీఏసీఎస్‌లో 494 మంది రైతులకు సంబంధించి రూ.1.94 కోట్లు మాఫీ అయ్యాయన్నారు. రుణమాఫీ పొందిన రైతులకు మళ్లీ రుణాలు అందిస్తామన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయండి

గజ్వేల్‌రూరల్: నియోజకవర్గ పరిధిలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని గజ్వేల్‌తో పాటు వర్గల్, ములుగు, మర్కుక్ ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తూ ఈఎస్ఐ ఇన్సూరెన్స్‌ను చెల్లిస్తున్నారన్నారు. అయినా వీరంతా అనారోగ్యానికి గురైనపుడు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట, గజ్వేల్‌లలో ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని, లేనిపక్షంలో కార్మికులతో కలిసి సీఐటీయూ పోరాటానికి పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, సద్దాం, అశోక్, సుధాకర్, రాజు, మల్లేష్ తదితరులున్నారు.

'స్టీల్ బ్యాంక్' కీర్తి ప్రజలకు అంకితం

హరీశ్‌రావు ఆలోచనకు ప్రతిరూపం

- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం
- భారత ఆర్థిక సర్వేలో స్టీల్ బ్యాంక్ ప్రస్తావన పట్ల బల్దియా పాలకవర్గం హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

సిద్దిపేటజోన్: 'ప్లాస్టిక్ రహిత లక్ష్యంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆలోచనకు ప్రతిరూపమే స్టీల్ బ్యాంక్ ఏర్పాటు జరిగింది.. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సిద్దిపేట స్టీల్ బ్యాంక్ ప్రస్తావన రావడం గర్వంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం' అని సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంజులరాజనర్స్, వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ ప్రసన్నరాణిలు మాట్లాడారు. దేశ స్థాయిలో స్టీల్ బ్యాంకు కీర్తి సిద్దిపేట ప్రజలకు అంకితమన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా 2020లో తొలిసారిగా స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అప్పట్లో పట్టణంలోని 4 వార్డులో మహిళ సంఘాల ఆధ్వర్యంలో మొదలు పెట్టిన స్టీల్ బ్యాంక్ క్రమేపీ జిల్లా వ్యాప్తంగా విస్తరించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. ప్రతియేటా నిర్వహించే పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా బుక్‌లో ఈ సంవత్సరం స్టీల్ బ్యాంకు గూర్చి ప్రస్తావన సంతోషకరమన్నారు. అందరి సమన్వయంతో సిద్దిపేట అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉందన్నారు. స్టీల్ బ్యాంకు, రుతుప్రేమలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయన్నారు. ప్రజల్లో మరింత చైతన్యం కోసం ప్రభుత్వం స్టీల్ బ్యాంక్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దీప్తి, రవి, మోహిజ్, వజీర్, సాయి ఈశ్వర్,బ్రమ్మం, సతీష్, శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్, మెప్మా అధికారులు సాయి, రమ్య, జ్యోతి, పట్టణ ఆర్పీలు పాల్గొన్నారు.

ముందుచూపుతోనే ఏర్పాటు..

ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా, ప్లాస్టిక్ కట్టడికి స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేసినట్లు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భారత ఆర్థిక సర్వేలో స్టీల్ బ్యాంకు చోటు దక్కడం సంతోషంగా ఉందన్నారు. విజన్ ఉన్న నాయకుడు హరీశ్ రావు ఆలోచనకు గొప్ప ఫలితం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళ సంఘాల ప్రతినిధులు, అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శర్మ, భూపేష్, సాయిరాం, మోహన్ లాల్, కనకయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛతకే ప్రాధాన్యం

హుస్నాబాద్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం

- కుక్కలు, కోతుల బెడదను అరికడతాం
- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్
- 'సాక్షి ఫోన్ ఇన్'కు అనూహ్య స్పందన



సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: 'హుస్నాబాద్ మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతాం. వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతాం' అని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ స్పష్టం చేశారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ప్రజలు అడిగిన ప్రతి సమస్యను నోట్ చేసుకొని కమిషనర్ సమాధానాలు ఇచ్చారు. పారిశుద్ధ్యం, మిషన్ భగీరథ నీరు, రహదారులు, మురికి కాలువల నిర్మాణాలు, దోమల నివారణ తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, ముఖ్యంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ 'సాక్షి'కి తెలిపారు.

పట్టణంలోని పలు చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను మురికి కాలువలో వేస్తున్నారు. దీంతో రోగాలు ప్రబలుతున్నాయి. సమస్య పరిష్కరించండి.

– కవ్వ వేణుగోపాల్ రెడ్డి, హుస్నాబాద్

కమిషనర్: చికెన్ సెంటర్ల యజమానులకు అవగాహన కల్పిస్తాం. మురికి కాలువల్లో వ్యర్థపదార్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం.

రోడ్లపైకి చెట్లకొమ్మలు వాలాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందులు పరిష్కరించాలి.

– విద్యాసాగర్, 11వ వార్డు

కమిషనర్: మున్సిపల్ సిబ్బందిని పంపించి చెట్ల కొమ్మలు తొలగించివేస్తాం. ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరిస్తాం.

ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కళాశాల ఏరియాలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైంది. ప్రజలపై, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి.

– సంపత్, 11వ వార్డు

కమిషనర్: పట్టణంలో యానిమల్ బర్త్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం. కుక్కలు, కోతుల బెడదను నివారిస్తాం.

పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ బొంద్రాయివాడలో మురికి కాలువలను శుభ్రం చేయడం లేదు. దుర్గంధం వ్యాపిస్తోంది. సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాం.

– బత్తుల శంకర్, 19వ వార్డు

కమిషనర్: మా సిబ్బందితో మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. అలాగే వైద్య సిబ్బందిచే వైద్య పరీక్షలు చేయిస్తాం. వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటాం. నీటి గుంతలల్లో ఆయిల్ బాల్స్ వేయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం.

మా ఇంటి పక్కన ఖాళీ స్థలంలో పొదలు పెరిగాయి. పందులు సంచరిస్తున్నాయి. దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించండి.

– ఎండీ. అసిఫ్ జానీ, 7వ వార్డు

కమిషనర్: పట్టణంలోని ఓపెన్ ప్లాట్స్ యజమానులకు నోటీసులు ఇస్తాం. చెట్లు తొలగించి, పందుల బెడదకు అడ్డుకట్ట వేస్తాం.

మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. వర్షం వస్తే బయటకు రావడానికి జంకుతున్నాం.

–దొడ్ల రాము, 6వ వార్డు

కమిషనర్: పక్షం రోజులకు ఒకసారి మురికి కాలువలను తీయిస్తాం. దోమల మందు స్ప్రే చేయిస్తాం. బ్లీచింగ్ పౌడర్ వేసి చర్యలు తీసుకుంటాం.

భగీరథ నీరు రంగుమారి వస్తోంది. పైగా కలుషితమవుతున్నాయి. అనారోగ్యానికి గురవుతున్నాం.

– అనంత స్వామి, 20వ వార్డు

కమిషనర్: భగీరథ పైపులైన్ల మరమ్మతులు చేయించి. లీకేజీని అరికడతాం. నీరు కలుషితం కాకుండా చర్యలు చేపడతాం. సమయ పాలన పాటించేలా సిబ్బందిని ఆదేశిస్తాం.

మా వార్డులో తాగునీరు తక్కువగా వస్తోంది. పైపు లైన్లను సరిచేసి తాగునీరు సరిపడా వచ్చేలా చర్యలు తీసుకోండి.

– శ్రీనివాస్, 12వ వార్డు

కమిషనర్: సమస్యను గుర్తించి పైపు లైన్లకు మరమ్మతులు చేయిస్తాం. సరిపడేలా తాగు నీటిని సరఫరా చేస్తాం.

భగీరథ పైపు లైన్ల కోసం రోడ్లను తవ్వి వదిలేశారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– సుదర్శన చారి, 15వ వార్డు

కమిషనర్: రోడ్లపై గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

పద్మశాలీ కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో చెట్లు, పొదలు పెరిగాయి. దీంతో పాములు, తేళ్లు వస్తున్నాయి. భయాందోళన చెందుతున్నాం.

– గాదర్ల మోహన్, 6వ వార్డు, వీవర్స్ కాలనీ, గొర్ల దేవేందర్ యాదవ్, 8వ వార్డు

కమిషనర్: ఓపెన్ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. చెట్లు, పొదలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

స్ట్రీట్ లైట్లు వెలుగక చిమ్మచీకట్లో ఉంటున్నాం. లైట్లు ఏరాపటు చేయాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

– లావుద్యా బిఖ్యా, 4వ వార్డు, బాలాజీ నగర్

కమిషనర్: స్ట్రీట్ లైట్లకు మరమ్మతులు చేయించి చీకట్లను తొలగిస్తాం.

మా కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడంలేదు. మరోవైపు డ్రైనేజీ లేక మురుగు నీరు రోడ్ల పైకి వస్తోంది. చర్యలు చేపట్టండి.

– గీకురు సంపత్, 2వ వార్డు

కమిషనర్: నిధులు మంజూరు కాగానే మురికి కాలువ నిర్మాణం చేపడుతాం. ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

మా వార్డుకు చెత్త బండి వస్తలేదు. ఫోన్ చేస్తేనే వస్తారు. రోజూ చెత్త బండి వచ్చేలా చర్యలు తీసుకోండి. – గొర్ల తిరుమలేష్, 8వ వార్డు

కమిషనర్: ప్రతి రోజు చెత్తను సేకరించడానికి చెత్త బండి పంపిస్తాం.

సెయింట్ జోసెఫ్ స్కూల్ ఎదుట వెంచర్లు ఏర్పాటు చేశారు. దీంతో మురికి నీరు వెళ్లకుండా కాలువను పూడ్చివేశారు. దీంతో మురుగు నీరంతా మడుగులా మారుతోంది. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది.


–సాయిరెడ్డి, 10వ వార్డు

కమిషనర్: మా సిబ్బందిని పంపించి సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

నవభారత్ స్కూల్ నుంచి వెంకటేశ్వర థియేటర్‌కు వెళ్లే రోడ్డులో మురికి కాలువలు లేవు. వర్షం పడితే బురదమయంగా మారుతోంది.

– కిషన్ నాయక్, టీచర్, 15వ వార్డు

కమిషనర్: సమస్యను గుర్తించి చర్యలు చేపడతాం. రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతాం.



పొంగిపొర్లుతున్న చెక్‌డ్యామ్

కూడవెల్లికి జలకళ

దుబ్బాక: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూడవెల్లి వాగు జలకళ సంతరించుకుంది. వర్షా కాలం ఆరంభమై రెండు నెలలు గడిచిపోతున్నా వర్షాలు లేకపోవడంతో నీళ్లు లేక బోసిపోయింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో కురిసిన వర్షాలకు తొగుట మండలం చంద్లాపూర్ వద్ద కూడవెల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ పూర్తిగా నిండి పొంగిపొర్లుతోంది.

క్లుప్తంగా

మారథాన్ టీషర్ట్ ఆవిష్కరణ



మారథాన్ టీషర్ట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఈ నెల 28న జరగనున్న హాఫ్ మారథాన్ సెకండ్ ఎడిషన్ టీషర్ట్‌ను తన కార్యాలయంలో సీపీ అనురాధ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్య, స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా హాఫ్ మారథాన్ సెకండ్ ఎడిషన్ పోటీలు సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సమన్వయంతో నిర్వహిస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల ఏర్పడే పర్యావసానాల గురించి మారథాన్‌లో పాల్గొనే వారికి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్‌రెడ్డి, రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు రాజు, కీసరి విజయ్‌కుమార్ గౌడ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలతో సిద్దిపేట డీఎం

సిద్దిపేటకమాన్: లక్ష్మే లక్ష్యం సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులు అందజేసినట్లు డీఎం సుఖేందర్‌రెడ్డి తెలిపారు. డిపోలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిద్దిపేట, దుబ్బాక డిపో పరిధిలోని ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన 60 మందికి బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ మహేశ్వరి, అసిస్టెంట్ ఇంజినీర్ రంజిత్‌కుమార్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కబేళాకు తాళం



కబేళా గేటుకు తాళం వేస్తున్న ఈఓ, ఎస్ఐ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయలో ఉన్న కబేళాకు మంగళవారం ఈఓ కృష్ణప్రసాద్, ఎస్ఐ నరేశ్ తాళం వేశారు. కాంట్రాక్టర్ దేవాలయానికి నిర్ణయించిన రుసుం ఇవ్వడం లేదని, వచ్చే భక్తుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నాడని ఆరోపణలు వినిపించడంతో చివరికి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే 31 మార్చి 2024 న పాలక మండలి కాంట్రాక్ట్ రద్దు చేశారని కోర్టును ఆశ్రయించాడు. రెండు మూడు రోజుల నుంచి అతను ఇక్కడకు వచ్చి కాంట్రాక్ట్ గడువు తీరనందున తానే నడుపుతానని ఆందోళన చేస్తున్నాడు. దీంతో కబేళాకు తాళం వేసి సీజ్ చేశారు.

భర్త మృతిపై అనుమానం ఉందని..

- పోలీసులకు భార్య ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: భర్త మృతిపై అనుమానం ఉందని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నకంజర్ల గ్రామానికి చెందిన కరీం(36) పది సంవత్సరాలుగా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ ప్లంబర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల16న ఇస్నాపూర్‌లో పురుగుల మందు తాగి కరీం ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో స్థానికులు చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. భర్త మృతిపై అతను పనిచేసే భవన నిర్వాహకుడు జంగయ్య పై అనుమానం ఉందని భార్య అన్సారీ బేగం అదేరోజు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండె చప్పుడు...

తండ్రి స్మారకార్థం ఉచిత గుండె వైద్యసేవలు



సిద్దిపేటలో తల్లిదండ్రుల నివాసంలో కార్డియాక్ సెంటర్

- పుట్టిన ఊరు రుణం తీరేలా
- ఇప్పటికే 20 వేల మందికి చికిత్స
- డాక్టర్ శ్రీనివాస్‌కుమార్ ఆదర్శనీయం

వేలాది మంది అభాగ్యులకు ఒక డాక్టర్ తన తండ్రి స్మారకార్థం ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. పుట్టిన ఊరి జనం కోసం, కన్న తల్లిదండ్రుల పేరిట 8 ఏళ్లుగా ప్రతి గురువారం ప్రత్యేకంగా కార్డియాక్ పరీక్ష కేంద్రాన్ని నిర్వహిస్తూ ఇప్పటివరకు సుమారు 20 వేల మందికి ఉచితంగా గుండె పరీక్షలు, వైద్యం చేశారు. ఆయనే సిద్దిపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది ఎర్రమరాజు రామరాజు, మధుసూదనాదేవి దంపతుల కుమారుడు శ్రీనివాస్ కుమార్.

– సిద్దిపేటజోన్

సిద్దిపేటలో బాల్యం చదువు అనంతరం ఉస్మానియాలో మెడిసిన్ పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రముఖ కార్డియాలజిస్ట్. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుండె వైద్యుడిగా పేరుండి నిత్యం వైద్య సేవల్లో బిజీగా ఉంటారు. అయితే తన పుట్టిన గడ్డకు వైద్య పరంగా సేవలు అందించేందుకు ఆలోచన అంకురార్పణ చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన వైద్య రంగంలో తండ్రి ఎర్రమరాజు రామరాజు స్మారకార్థం ఉచితంగా పేదలకు వైద్యం అందించాలని ఎనిమిది ఏళ్ల క్రితం ఆలోచన వచ్చింది. వైష్ణవ భక్తుడు అయిన తండ్రి రామరాజుకు ఇష్టమైన చిన్న జియ్యర్ స్వామి చేతుల మీదు 2016లో ఉచిత వైద్యాన్ని ప్రారంభించారు. ప్రతి గురువారం గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, సంబంధించిన ఖరీదైన ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా అందిస్తారు. తాను వైద్య వృత్తి రీత్యా బిజీగా ఉన్నప్పటికీ వైద్య పరీక్షల కోసం ప్రతి వారం ప్రత్యేకంగా ఒక కార్డియాక్ డాక్టర్‌ను సిద్దిపేటకు పంపి పరీక్షలు నిర్వహించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పరీక్షల సందర్భంగా ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఆరోగ్య శ్రీ ద్వారా హైదరాబాద్‌లో వైద్యం అందించి సిద్దిపేట ప్రాంత వాసులకు భరోసాగా నిలుస్తున్నారు.



ఉచిత వైద్యం కోసం వచ్చిన వారు

గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారు, గతంలో గుండె జబ్బులు ఉన్నవారు, స్టెంట్, బైపాస్ సర్జరీ అయిన వారు, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వ్యాధిగ్రస్తులకు ప్రతి గురువారం ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. పట్టణంతో పాటు దుబ్బాక, గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలోని వందలాది గ్రామాల ప్రజలు గుండె జబ్బుల పరీక్షల కోసం వస్తుంటారు. ఎనిమిది ఏళ్లలో ఇప్పటి వరకు సుమారు 20 వేల మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

కన్న వారికి ప్రేమతో..



నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం అమ్మానాన్న. పుట్టిపెరిగిన సిద్దిపేటకు ఏదో చేయాలని ఎప్పుడూ నాలో ఒక కోరిక. అలాంటిది 2015లో నాన్న చనిపోయిన తర్వాత నేను సిద్దిపేట ప్రజలకు ఉచితంగా గుండె సంబంధిత వైద్య సేవలు అందించాలి అనుకున్నా. భగవంతుడి దయవల్ల ఇప్పటికే ఉచితంగా వైద్యసాయం అందుతోంది. దీన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

–డాక్టర్.ఎర్రమరాజు శ్రీనివాస్ కుమార్

ఎందరికో ఆపద్బాంధవుడు

నాకు గుండె సంబంధిత సమస్య వచ్చింది. డాక్టర్ గూర్చి తెలుసుకొని వెళ్లి పరీక్షలు చేసుకున్న. నాకు ధైర్యం చెప్పి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు చేశారు. ఇప్పటికే ఆయన వద్ద వైద్యం ఉచితంగా పొందుతున్నా. ఎందరికో ఆయన ఆపద్బాంధవుడిగా మారారు

–లచ్చిరెడ్డి, సిద్దిపేట

మానవత్వం చాటిన కానిస్టేబుల్



దివ్యాంగురాలిని కుర్చీ సహాయంతో పరీక్ష గదిలోకి తీసుకు వెళుతున్న కానిస్టేబుల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డీఎస్సీ పరీక్ష రాయడానికి వచ్చిన దివ్యాంగురాలను కానిస్టేబుల్ వెంకటేశ్ సెక్యూరిటీతో కలిసి పరీక్ష కేంద్రంలోని తీసుకుని వెళ్లి మానవత్వాన్ని చాటారు. సిద్దిపేట పట్టణం కరీంనగర్ రోడ్‌లో ఉన్న వెరిటస్ వర్చస్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ లో మంగళవారం డీఎస్సీ పరీక్ష రాయడానికి వచ్చిన దివ్యాంగురాలు మెట్లు ఎక్కడానికి ఇబ్బంది పడుతోంది. అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వెంకటేశ్ సెక్యూరిటీ గార్డ్‌తో కలిసి ఒక ప్లాస్టిక్ కుర్చీలో కూర్చోబెట్టుకుని పైకి తీసుకొని వెళ్లి పరీక్ష గదిలో దించారు. సన్నివేశాన్ని చూసిన డీఎస్సీ అభ్యర్థులు, పరీక్ష నిర్వహణలో ఉన్న బృందం కానిస్టేబుల్, సెక్యూరిటీ గార్డులను అభినందించారు.

పోలీసుల అదుపులో జూదరులు

గజ్వేల్‌రూరల్: బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని రింగురోడ్డు మార్గంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో ఓ వెంచర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే అక్కడికి పోలీసు సిబ్బంది వెళ్ళగా నలుగురు పేకాట ఆడుతున్నట్లు గుర్తించి, వారిని నుంచి రూ. 14వేల నగదుతో పాటు 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రాంతాల్లో పేకాట ఆడటం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

స్టాక్ మార్కెట్ పేరిట మోసం

రూ.99.79 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: స్టాక్ మార్కెట్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టోకరా వేసి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసు కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్‌కు చెందిన బెజవాడ నాగార్జున ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తన వాట్సాప్‌కు జులై 5న స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్‌ను నాడియా కామి అనే మహిళ పంపితే వివరాలను నమోదు చేశాడు. తర్వాత ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో దఫాలవారీగా ఇన్వెస్ట్ చేసిన నగదు రూ.82 లక్షలతో కలిపి మొత్తంగా వాలెట్‌లో రూ.కోటీ 30 లక్షలు చూపించారు. ఒక రోజు నగదు డ్రా చేసుకుంటానంటే రూ.17 లక్షలు టాక్స్ చెల్లిస్తేనే అంతా డ్రా చేసుకోవచ్చని నమ్మించారు. దీంతో బాధితుడు అప్పు చేసి, తన వద్ద ఉన్న బంగారాన్ని అమ్మి రూ.17 లక్షలు చెల్లించిన తర్వాత అటు వైపు ఉన్న అపరిచిత వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, సోమవారం అర్ధరాత్రి పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో నగదు వేసిన అకౌంట్‌లో ఉన్న రూ. 24 లక్షల నగదు హోల్డ్ చేసినట్లు పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలపై 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.



ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట..

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ప్రైవేట్ ఉద్యోగి భారీగా నగదు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఏఆర్ బృందావన్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 17న ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. లింకును ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. ముందుగా బాధితుడు లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేయగా మూడు లక్షలు లాభాలు చూపించారు. పలు దఫాలుగా స్నేహితుల వద్ద నగదు తీసుకొని, బంగారం అమ్మి మొత్తం రూ.98.40 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం సోమవారం రాత్రి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు వేసిన అకౌంట్‌లో ఉన్న రూ. లక్షను హోల్డ్ చేశామన్నారు.

ఫోన్ కాల్‌కు స్పందించి..

తూప్రాన్: గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్‌కు స్పందించి నగదు పోగొట్టుకుంది ఓ యువతి. ఈ సంఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ యువతికి ఓ గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఇంటర్నేషనల్ కొరియర్ తన పేరు పైన వెళ్తుందని నమ్మించారు. ఇందుకోసం సైబర్ క్రైమ్ బ్యూరోకు కనెక్ట్ అవ్వడానికి ఒకటి నొక్కాలని సూచించారు. తన ఫోన్లో ఒకటి నంబర్ నొక్కగానే స్కైప్ పై వీడియో కాల్‌లో ఐసీఐసీఐ బ్యాంక్ వెరిఫికేషన్ అని చెప్పి వివరాలు తెలిపారు. ఇవే తనవేనని చెప్పింది. తన అకౌంట్లో 6 లక్షల రూపాయలు వచ్చాయని చెక్ చేసుకోండి అని సైబర్ నేరగాళ్లు చెప్పారు. నమ్మి తన బ్యాంక్ పోర్టల్ ఓపెన్ చేయగా ఫోన్ సరిగా పనిచేయలేదు. తర్వాత ఐదు లక్షల రూపాయాలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో వెంటనే పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కుటుంబ సమస్యల వల్లే చనిపోతున్నా..
సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



సాయికిరణ్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కుటుంబసమస్య వల్లే తాను చనిపోవడానికి కారణమని సూసైడ్ నోట్ రాసి ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విద్యుత్‌నగర్‌లో నివాసం ఉండే సాయికిరణ్(28) విప్రో సంస్థలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి. అతని చిన్నప్పుడే తల్లి మృతి చెందింది. తండ్రి రెండో వివాహం చేసుకున్నాడు. చిన్ననాటి నుంచి ఇస్నాపూర్‌లోని అమ్మమ్మ వద్ద ఉండి చదువుకున్నాడు. విప్రోలో ఉద్యోగం రావడంతో రెండు నెలలగా విద్యుత్‌నగర్‌లో నివాసముంటున్న తండ్రి నర్సింగ్‌రావు వద్దే ఉంటున్నాడు. బోనాల పండుగ సందర్భంగా తండ్రి, సవతి తల్లి మహాలక్ష్మి శనివారం జోగిపేటకు వెళ్లారు. ఆదివారం సాయికిరణ్ మహాలక్ష్మికి ఫోన్ చేసి మాట్లాడాడు. మంగళవారం మధ్యాహ్నం వారిద్దరూ తిరిగొచ్చారు. ఇంటి తలుపులు వేసి ఉండటంతో ఎంత పిలిచినా తలుపులు తీయడం లేదు. దీంతో కిటికీలో నుంచి చూస్తే సాయికిరణ్ తన గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందడాన్ని గమనించి ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. వారొచ్చి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలిస్తే మృతుడి వద్ద సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్య చేసుకుని రెండు రోజులై ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

అప్పులబాధతో గీత కార్మికుడి..



ఆంజనేయులు (ఫైల్)

తొగుట(దుబ్బాక): అప్పుల బాధ తాళలేక గీత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని లింగాపూర్‌లో జరిగింది. తొగుట ఎస్ఐ వి.రవికాంత్‌రావు తెలిపిన కథనం ప్రకారం.. లింగాపూర్‌కు చెందిన చేపూరి ఆంజనేయులు కొంత కాలంగా మహారాష్ట్రలో దేశీదారు దుకాణం నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ వ్యాపారం సరిగా సాగడపోవడంతో అప్పుల పాలయ్యాడు. రెండు సంవత్సరాల నుంచి లింగాపూర్‌కు వచ్చి జీవిస్తున్నాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియ మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై ఈ నెల 22న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య భాగ్యలక్ష్మి దౌలాపూర్‌లో ఉన్న పుట్టింటికి వెళ్లిపోయింది. రుణ బాధ తాళ లేక మంగళవారం ఉదయం లింగాపూర్‌లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇంటి చుట్టుపక్కలవారు గమనించి గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అతను మృతిచెందాడు. మృతుడి భార్య భాగ్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్ తగిలి లారీడ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ షాక్ తగిలి లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన అభినాశ్ కుమార్ బతుకుదెరువు కోసం వచ్చి జిన్నారం మండలం సోలక్‌పల్లికి వచ్చి డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి కాజీపల్లి క్రషర్‌లో టిప్పర్‌లో కంకర్ లోడు చేసుకొని కూకట్‌పల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో గండిగూడ గ్రామ సమీపంలోకి రాగానే వాహనం ఆపి, పైకి ఎక్కి టార్పాలిన్ పట్టా కప్పుతుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న విద్యుత్ వైర్ చేయికి తగిలి షాక్ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు రాగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి బంధువు జయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాత అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తాత అదృశ్యమయ్యాడని మనవడు ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని శిల్పా విలాస్‌కు చెందిన వృద్ధుడు రంగరాజు సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తాత అదృశ్యంపై అతను ఫిర్యాదు చేశాడు.

ఇరువర్గాల గొడవ

14 మందిపై కేసు నమోదు

టేక్మాల్(మెదక్): భూ వివాదంలో ఇరువర్గాల మధ్య గొడవ జరగగా 14 మందిపై కేసు నమోదైంది. మండలంలోని షాబాద్‌తండా పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమి అయినా 86 సర్వే నంబర్‌లో తమ భూమిలోకి వచ్చారని ఓ వర్గం, దున్నుతూ మా భూమిలోకి వస్తున్నారని మరో వర్గం కర్రలతో దాడులు చేసుకున్నాయి. ఇందులో రమావత్ బుజ్జి, రమావత్ దినేశ్‌లను గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. నల్లకుంటతండాకు చెందిన అంబిర్యానాయక్, శాబాద్‌తండాకు చెందిన రమావత్ ప్రవీణ్ ఇరు వర్గాలపై ఫిర్యాదు చేసుకున్నారు. మొత్తంగా రమావత్ నితిన్, రమావత్ పవన్, రమావత్ ప్రభాస్, రమావత్ నాగేశ్, రమావత్ వసంతరావు, రమావత్ శంకర్, రమావత్ అనిత, మాలోత్ కిషన్, రమావత్ సేవాలాల్, రమావత్ ప్రకాశ్, రమావత్ గోపాల్, రమావత్ అబింర్యా, ముదావత్ రెడ్డి, రమావత్ దినేశ్‌లపై కేసు నమోదైంది. భూ వివాదం పూర్తిగా సద్దుమణిగే వరకు ఎవరూ కూడా ఆ భూమిలోకి వెళ్లకూడదని ఎస్ఐ మురళి హెచ్చరించారు.

ఎస్పీకి ఫిర్యాదు..

ఈ వివాదంపై మండలంలోని శాబాద్‌తాండాకు చెందిన పలువురు అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సమక్షంలో మంగళవారం ఎస్పీ ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకులు రైతులపై దాడులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, తిరిగి బీఆర్ఎస్ వారిపైనే కేసులు పెడుతున్నారని క్రాంతికిరణ్ ఆరోపించారు. ఈ విషయమై ఎస్పీ.. ఎస్ఐ మురళిని మెదక్ జిల్లా కార్యాలయానికి పిలిపించుకొని వివరాలు తెలుసుకున్నట్లు తెలిసింది.

లక్ష్యాన్ని సాధించాలి

మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ లక్ష్యాన్ని సాధించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి సూచించారు. మంగళవారం పట్టణంలోని వర్మీ కంపోస్టు యార్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తడి చెత్త ద్వారా ఎరువుల తయారీ ప్రక్రియ పరిశీలించారు. సేంద్రియ ఎరువుల విక్రయాలను గూరించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్ పరిశీలించారు. యంత్రాల పనితీరు గురించి ఆరా తీశారు. ఎరువులు ఎప్పటికప్పుడు విక్రయించాలని సూచించారు. అనంతరం హౌసింగ్ బోర్డ్‌లో పర్యటించారు. వార్డులో రోడ్డు ఆక్రమణ ఫిర్యాదు మేరకు విచారణ జరిపి నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే 32 వార్డులో చెరువు కట్ట మీద ఉన్న దేవాలయం నిర్మాణ పనులు పరిశీలించారు.

బాలకార్మికుల గుర్తింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముగ్గురు బాల కార్మికులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మంగళవారం రాత్రి ఎస్ఐ యాదగిరి ఆధ్వర్యంలో కానిస్టేబుల్‌లు సంతోష్, శ్రీనివాస్, పుష్పలు పాత రామచంద్రాపురంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ సమయంలో ఏ1 బైక్ పాయింట్ వద్ద ఇద్దరు మైనర్లతో పనిచేయిస్తున్నట్లు గుర్తించి యాజమాని ఎండీ ముక్తర్‌పై కేసు నమోదు చేశారు. అలాగే బండలగూడలోని ఓ ఐరన్ దుకాణంలో మైనర్‌తో పనిచేయిస్తున్న యాజమాని కణతి దుర్యోధనపై కేసు నమోదు చేశారు.

గుణాత్మకమైన విద్యకు ప్రాధాన్యం

ఎంఈఓలతో కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచి మంచి గుణాత్మకమైన విద్యను విద్యార్థులకు అందించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మండల విద్యాధికారు(ఎంఈఓలు)లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మండల విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ నోడల్ అధికారులు , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యను అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, ఇతర కార్యక్రమాల ద్వారా అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ అభ్యాసన శక్తిని పెంపొందించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. అభ్యాసన సమస్యల ప్రకారం ఏ, బీ, సీ గ్రూపులుగా వర్గీకరించాలని, తక్కువ సామర్థ్యం గల వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏయే సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆయా సబ్జెక్టుల్లో అర్థమయ్యేలా ప్రత్యేక బోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి కేస్ షీట్ రూపొందించి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించాలన్నారు. మార్కులే లక్ష్యంగా కాకుండా విజ్ఞానం లక్ష్యంగా బోధన చేస్తే ఆటోమెటిక్‌గా పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన ప్రదర్శిస్తారన్నారు. ప్రతి పాఠశాలలో గేమ్స్ , డిబెట్స్, కల్చరల్ , డ్రాయింగ్ తదితర కమిటీలను ఏర్పాటు చేసి చురుగ్గా పాల్గొనేలా చేయాలన్నారు. తద్వారా పర్సనాలిటీ డెవలప్మెంట్ బాగుంటుందన్నారు. ప్రభుత్వం అన్ని స్కూళ్ల లైబ్రరీలకు అనేక విజ్ఞాన పుస్తకాలను పంపించిందని ఉపయోగించుకోవాలన్నారు. హాజరు శాతం పెరిగేలా చూడాలని, అన్ని పాఠశాలలో టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేసి వివరాలతో పాటు మధ్యాహ్న భోజనం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది రిజిస్టర్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ జెడ్పీ హైస్కూల్ ని ఆదర్శంగా తీసుకొని అడ్మిషన్ కోసం పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

అధికారిక దత్తతతో చిక్కులుండవు

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: జిల్లాలో పిల్లలు లేని దంపతులు దరఖాస్తు చేసుకొని ఆ తర్వాత పిల్లలను దత్తత తీసుకుంటే ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆడ శిశువును అధికారికంగా దత్తత ఇచ్చారు. కార్యక్రమానికి ఆమె హాజరై ఆంధ్ర రాష్ట్రం విశాఖపట్నం జిల్లాకు చెందిన దంపతులకు చిన్నారిని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాపను బాగా చదివించాలని, తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహించాలని తల్లితండ్రులకు చెప్పారు. చిన్నారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే పూర్తి బాధ్యత వారిదేనన్నారు. ఇప్పటివరకు శిశు గృహ సంక్షేమ శాఖ ద్వారా 3 చిన్నారులను దత్తతకు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, బాలరక్షా భవన్ కోఆర్డినేటర్ మమత , జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, శిశు గృహ మేనేజర్ ఝాన్సీ పాల్గొన్నారు.

ఏబీసీ కేంద్రం పరిశీలన

సిద్దిపేటజోన్: కలెక్టర్ మనుచౌదరి, మున్సిపల్ చైర్మన్ మంజుల ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి.. స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయ పరిసరాల్లో ఉన్న ఏబీసీ(ఎనిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాన్ని పరిశీలించారు. సిద్దిపేట ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న వీధి కుక్కల బెడదపై సాక్షి ఫోన్ ఇన్ లో పెద్ద ఎత్తున వినతులు వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై ఆమె కలెక్టర్ మనుచౌదరికి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఏబీసీ కేంద్రం పునః ప్రారంభించడానికి నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఆపరేషన్ థియేటర్, కుక్కల సంరక్షణ గదులు, వసతులను పరిశీలించారు. విద్యుత్, నీటి వసతి, గూర్చి ఆరా తీశారు. కేంద్రాన్ని శుభ్రం చేసి వినియోగంలోకి తేవాలని సంకల్పించారు. ఈ మేరకు బుధవారం సంబంధించి నిర్వహణ ప్రక్రియ కోసం వివిధ స్వచ్ఛంద సంస్థలు, వెటర్నరీ, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆమె ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.



కుక్కల జనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, అధికారులు